క్లుప్తంగా

లోక కల్యాణం కోసం హోమాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్‌లో వెలసిన కోదండ రామాలయంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం శ్రీ వినాయక, ధన్వంతరి, సుదర్శన హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి స్వామి వారికి ప్రత్యేక రజత నవ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రుద్రవరం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు శనివారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 22 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలికలకు హాస్టల్ వసతి ఉందని, అదనపు సమాచారం కోసం సెల్ 9849215838 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సేవలతోనే గుర్తింపు



బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఏపీఓ, ఉపాధి సిబ్బంది

ఉయ్యాలవాడ : ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమే అయినప్పటికీ.. విధి నిర్వహణలో అంకితభావంతో ప్రజలకు సేవ చేస్తేనే గుర్తింపు లభిస్తుందని ఉపాధి ఏపీఓ రవిప్రకాష్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఏఓ సత్యన్న పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు బదిలీ కావడంతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంటు వి.నాగేంద్రారెడ్డి కోనసీమ జిల్లాకు, ఎస్.ఓబుళరెడ్డి కాకినాడ జిల్లా, ఎస్.ఖాలేషా కర్నూలు జిల్లా, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బరాయుడు విజయనగరం జిల్లాకు, అలాగే అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా మధుసుదర్శన్‌రెడ్డి (కంప్యూటర్ ఆపరేటర్) ఆళ్లగడ్డ మండలానికి బదిలీ కావడంతో వారిని ఘనంగా సన్మానించారు.

మజ్జిగ పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక నాగులకుంట రోడ్డులో అహోబిల స్వాతి గ్రూప్, శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. నిర్వాహకులు మధుసూదన్ మాట్లాడుతూ శనివారం 500 మందికి మజ్జిగ పంపిణీ చేశామని చెప్పారు. ఎండ నుంచి ప్రయాణికులు, భక్తులు ఉపశమనం పొందేందుకు దాతల సహకారంతో కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రుద్రవరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పెద్దకంబలూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని కోటకొండ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే వేసవిలో విద్యుత్, నీటిని పొదుపుగా వాడుకోవాలని, మొక్కలను నాటుకోవాలని చెప్పారు.కార్యక్రమంలో ఫారెస్టు బీట్ అధికారి బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

నంద్యాల(అర్బన్): విద్యుత్ తీగలు తెగినా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా, లో ఓల్టేజీ సమస్యలు ఉన్నా.. తమ దృష్టికి తెస్తే సత్వర పరిష్కారం చూపుతామని పట్టణ విద్యుత్ శాఖ డీ2 ఏఈ రామయ్య తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతకు ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో చెట్లు విరిగి విద్యుత్ తీగల మీద పడే అవకాశం ఉన్నందున వీధుల్లోని చెట్ల కొమ్మలను ఇప్పటికే తొలగించే పనులు చేపడుతున్నామని చెప్పారు.

టెక్నికల్ అసిస్టెంట్ల బదిలీ

గోస్పాడు: మండల కేంద్రంలో పనిచేస్తున్న నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లను ఇతర జిల్లాలకు బదిలీ చేసినట్లు ఏపీఓ నాగజ్యోతి తెలిపారు. ఆళ్లగడ్డ నుంచి గోస్పాడులో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న కరీముల్లా, రుద్రవరం నుంచి డిప్యుటేషన్‌పై గోస్పాడులో పని చేస్తున్న బాబయ్య కాకినాడ జిల్లాకు, అలాగే అక్బర్‌వలి అంబేడ్కర్ కోన సీమ జిల్లాకు, ఉమాశంకర్ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారని చెప్పారు. ఆపరేటర్ వెంకటేశ్వరరెడ్డి విజయనగరం జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో వారు రిలీవ్ అయ్యారని వివరించారు.

బండి సరే.. లైసెన్స్ ఏదీ?

- మొత్తం వాహనదారుల్లో నగం మందికే లైసెన్సు
- రెన్యూవల్‌కూ దూరం
- ఏడాదిలో 6,859 వాహనాలపై కేసులు
- రూ.9.29 కోట్ల జరిమానా వసూలు
- నిబంధనలు ఖాతరు చేయని వాహనదారులు

లక్షల రూపాయలు వెచ్చించి నచ్చిన వాహనం కొనుగోలు చేస్తారు. అయితే బండి నడపడానికి అవసరమైన లైసెన్స్ మాత్రం తీసుకోరు. నిబంధనలు పాటించాలని, జరిమానాలు తప్పవని తెలిసినా.. అధిక శాతం వాహనదారులు లైసెన్స్ పొందడం లేదు. ఇక లైసెన్స్ గడువు తీరిన వారిలో అధిక శాతం రెన్యూవల్ చేయించుకోవడం లేదు. వచ్చీరాని డ్రైవింగ్‌తో ప్రమాదాలకు కారణమవుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. అలాంటి వాహనదారులపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నా మార్పు కనిపించడం లేదు.



వాహనానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ అధికారులు (ఫైల్)

నంద్యాల(రూరల్): వాహనం నడపాలంటే డ్రైవింగ్ తెలిసి ఉండాలి. లెసెన్సు తప్పనిసరిగా ఉండాలి. ఈ విషయాన్ని వాహనదారులు ఖాతరు చేయడం లేదు. ఎంత ఖర్చయినా .. మెచ్చిన వాహనం కొనుగోలు చేస్తున్నారే కానీ లైసెన్సు తీసుకోవడానికి మాత్రం ముందుకు రావడం లేదు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదానికి గురైతే బీమా వర్తించదు. ప్రాణాలు పోవడమో.. అంగవైకల్యానికి గురికాక తప్పదనే విషయాలు తెలిసీ..వచ్చీ రాని డ్రైవింగ్‌తో పాటు ట్రాఫిక్, డ్రైవింగ్ నిబంధనలు తెలియకుండా రయ్..రయ్‌మంటూ దూసుకెళ్తూ ఎదుటి వారి ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితికి చెక్ పెట్టేందుకు రవాణా శాఖతో పాటు పోలీస్ శాఖ నిత్యం జరిమానాలు విధిస్తూ, హెచ్చరికలు జారీ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

చిక్కినా.. మార్పు లేదు..

జిల్లాలో రవాణా శాఖ పరిధిలో అధికారులు, పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహించి లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధిస్తున్నారు. జిల్లాలో గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 2,628 ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, 16,849 నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు రిజిష్టర్ కాగా, అందులో కేవలం 4,305 మందికి మాత్రమే లైసెన్స్‌లున్నాయి. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వారిలో లైసెన్స్‌లు లేని వారే అధికంగా ఉంటున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వాహనదారుల్లో మార్పు కోసం ఎల్ఎల్ఆర్ మేళా, రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించి, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. డ్రంకెన్ డ్రైవ్, ఓవర్‌లోడ్ వంటి వాటికి జరిమానాలు విధిస్తున్నా డ్రైవర్లలో మార్పు కనిపించడం లేదు.

గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు వాహనాల వివరాలు..	
రిజిష్టర్ అయిన ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు	2,628
రిజిష్టర్ అయిన నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు	16,849
లైసెన్స్‌లు పొందిన వారు	4,305
కేసులు నమోదైన వాహనాల సంఖ్య	6,859
పెనాల్టీ చెల్లించిన వాహనాల సంఖ్య	6,118
పెనాల్టీ ద్వారా వసూలైన మొత్తం	రూ. 9,29,12,860
పెనాల్టీ చెల్లించాల్సిన వాహనాల సంఖ్య	741

భారీగా పెనాల్టీలు..

లైసెన్స్‌లు లేని, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారిపై రవాణా శాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. భారీగా పెనాల్టీ విధిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి జిల్లా వ్యాప్తంగా 10 మంది ఎంవీఐలు పెద్ద ఎత్తున వాహనాలను తనిఖీ చేశారు. మొత్తం 6,859 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అందులో 6,118 వాహనాలకు సంబంధించిన వాహనదారులు పెనాల్టీ కింద రూ.9,29,12,860 చెల్లించారు. ఇంకా 741 వాహనాలకు సంబంధించిన వాహనదారులు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంది. రానున్న రోజుల్లో నిబంధనలు మరింత కఠినతరం చేసి ఉల్లంఘనులపై చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

జరిమానాతోపాటు జైలుశిక్ష



డ్రైవింగ్ లెసెన్స్ లేకుండా వాహనాలు నడపటం ప్రమాదకరం, నేరం. పోలీసుల సహకారంతో రవాణా శాఖ పరిధిలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం డీఎల్ ప్రక్రియను సులభతరం చేసింది. ఎల్ఎల్ఆర్ పరీక్షలో అతి సులువైన ట్రాఫిక్ సిగ్నల్‌కు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. డీఎల్ రెన్యూవల్ చేసుకోని చోదకులు వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. గతంలో పట్టుకున్న వాహనాలకు నోటీసులు జారీ చేశాం . వారు వెంటనే అపరాధ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అవగాహన లేని డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాంటి వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం.

– జీవీ శివారెడ్డి, డీటీఓ, నంద్యాల

పాత వస్తువులను రీ సైక్లింగ్ సెంటర్‌కు ఇవ్వండి



ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి

నంద్యాల(సిటీ): పాత పుస్తకాలు, పాత దుస్తులు, ప్లాస్టిక్, ఇనుప వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రీ సైక్లింగ్ కేంద్రానికి అందజేయాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి కోరారు. స్వచ్ఛ భారత్–2.0లో మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ షహర్ అనే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఇంజేడులో ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

ఉయ్యాలవాడ : ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నకిలీ విత్తన విక్రయాలను అరికట్టండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- ఎద్దులకు కూడా 'వైఎస్సార్ పశు బీమా' వర్తింపు
- జిల్లా కలెక్టర్ శామూన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి

నంద్యాల: నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత దుకాణాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో 20 మెట్రిక్ టన్నుల ఎరువులు, విత్తనాలు సాగుకు ముందే సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు వేసుకున్న ప్రతి పంటను ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించే పంటలపై అవగాహన కల్పించాలని చెప్పారు. పీఎం కిసాన్ కింద పెండింగ్‌లో ఉండి అర్హత కలిగిన 29,764 మంది రైతుల ఈ–కేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ పశు బీమా పథకం కింద పశువులు, మేకలు గొర్రెల తరహాలోనే ఎద్దులకు కూడా వర్తించేలా వచ్చే నెల నుంచి ప్రారంభించనున్నారని తెలిపారు. మొత్తం ప్రీమియంలో 80 శాతం ప్రభుత్వం భరిస్తుండగా 20 శాతం లబ్ధిదారుల వాటాగా ఉంటుందన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందించాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణను కోరారు. నంద్యాల ప్రాంతంలో 55 నర్సరీలు ఉన్నాయని, సంబంధిత నర్సరీల్లో నకిలీ విత్తనాల విక్రయ ప్రక్రియను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడమా..



శ్రీనివాస సెంటర్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల: పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధులతో పోల్చడం సిగ్గు చేటని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా అన్నారు. శనివారం నంద్యాలలో చంద్రబాబు వ్యాఖ్యలపై ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇంటి నుంచి శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆమె మాట్లాడుతూ తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన స్థలాలను శ్మశానవాటికలతో పోల్చడం ఆయన దురహంకారానికి నిదర్శనమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే పేదల కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 30 లక్షల మంది అక్కాచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దృశ్యకళా డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



నూర్జహాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

నంద్యాల: అవుకు రిజర్వాయర్ బోటు ప్రమాదంలో మృతి చెందిన నూర్జహాన్ కుటుంబాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి పరామర్శించారు. శనివారం పట్టణంలోని నందమూరినగర్‌లో నూర్జహాన్ భర్త బషీర్‌బాషా ఇంటికి వెళ్లి వారికి ధైర్యం చెప్పారు. శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, మహబూబ్‌బాషా, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

గాలీవాన బీభత్సం

దొర్నిపాడు: మండలంలో శనివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఉయదం నుంచి భానుడి సెగలకు జనం అల్లాడిపోయారు. అయితే ఒక్కసారిగా వచ్చిన మార్పులతో వాతావరణం చల్లబడింది. గాలికి డబ్ల్యూ గోవిందిన్నె– చాకరాజువేముల మధ్య దారిలో చెట్టు విరిగి పడటంతో రాకపోకలు అంతరాయం కలిగింది.



డబ్ల్యూ గోవిందిన్నె వద్ద రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు

వేలంలో పెరిగిన ఆదాయం

దొర్నిపాడు: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆలయ భూముల వేలంలో గతేడాదితో పోలిస్తే రూ. 3.33 లక్షల ఆదాయం పెరిగిందని ఈఓ వీరయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ మాధవస్వామి ఆలయానికి చెందిన 54.24 ఎకరాలకు ఏడాదికి సంబంధించి కౌలుకు వేలం నిర్వహించగా రూ.5.30లక్షలు పలికింది. కాగా.. గతేడాది రూ.3.24 లక్షలు వచ్చిందన్నారు. అలాగే గణాధిపతి, చౌడేశ్వరీదేవి ఆలయానికి చెందిన 26 ఎకరాలకు ప్రస్తుతం రూ. 4.56 లక్షలు రాగా, గతేడాది రూ.3.29 లక్షలు లభించిందని చెప్పారు. ఆయా ఆలయాల చైర్మన్లు కాకనూరు చిన్న వెంకటరామిరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ ఆర్ఐ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాన్ని ప్రభుత్వాలు కాపాడాలని కోరారు. వైఎస్సార్ పాలనలో సంక్షేమ బోర్డును ప్రారంభించి కార్మికులకు 11 రకాల సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల పదోన్నతులు పొందిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పక్కీర్‌రెడ్డి కోరారు. శనివారం ఈ మేరకు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2023 జనవరిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను పాఠశాల సహాయకులుగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో పదోన్నతులు కల్పించారని, సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా పనిచేస్తున్నారన్నారు. రెగ్యులర్ పదోన్నతులు కల్పించి ఎఫ్ఆర్ 22 ప్రకారం ఇంక్రిమెంట్లు ఇస్తామని చెప్పారని, గౌరవ వేతనం కూడా మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం నూతన జాబితాను పరిశీలిస్తే చాలా మంది పదోన్నతి కోల్పోవాల్సి వస్తుందన్నారు. విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మహబూబ్‌బాషా, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన వీఆర్ఏ బందెల దాసెన్న (58) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ కార్యాలయ ఆర్ఐ సత్తార్, తలారుల సంఘం మండల అధ్యక్షుడు అల్లాబకాష్, వీఆర్ఓలు గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతి పట్ల సానుభూతి వెలిబుచ్చారు. అంత్యక్రియలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేలను కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఆర్ఐ సత్తార్ తెలిపారు.

4న విద్యార్థులకు పురస్కారాలు

నంద్యాల(వ్యవసాయం): పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని పబ్బు తులసీ కృష్ణ తెలిపారు. శనివారం స్థానిక పద్మశాలీయ సేవా ట్రస్టు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదిలో 540కి పైగా మార్కులు సాధించిన వారికి ఇంటర్ ఫస్టియర్ మంచి మార్కులు సాధించిన వారికి జూన్ 4న ప్రశంసా పత్రం, పుస్తకాలు అందజేస్తామన్నారు. అలాగే 2023 నీట్‌లో ఎంబీబీఎస్ సాధించి, ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.10వేలు చొప్పున నాలుగేళ్ల పాటు అందజేస్తామని చెప్పారు. విద్యార్థులు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు



పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి పేదల కుటుంబాలు వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 15వ వార్డులో కౌన్సిలర్ అనూషతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి రోజు నుంచే ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలను పూర్తిస్థాయిలో అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే కొత్త ఉత్సాహం వస్తుందన్నారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పథకాలు అందిస్తున్నామని, దాన్ని చూడలేని ప్రతిపక్షాలు పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. పథకాలు అందుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, తెలుగుదేశం నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడమే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, వాటర్ వర్క్స్ ఇంజినీర్ ప్రకాష్, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిరాంరెడ్డి, నాయకులు జమాల్, శీను, సంతప్, షాకీర్, లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థులకు ముస్లిం మైనార్టీ నాయకురాలు షేక్ ఫాతిమాబీ సహకారంతో ఎమ్మెల్యే శిల్పారవి చేయూతనందించారు. శనివారం శిల్పా స్వగృహంలో కంప్యూటర్ కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఫాతిమాబీని ఎమ్మెల్యే అభినందించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



చాగలమర్రిలో నిర్మాణం పూర్తయిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాస్

ఆళ్లగడ్డ: జగనన్న కాలనీల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని, ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా రూరల్ మండలం కోటకందుకూరు గ్రామ జగనన్న కాలనీలో శనివారం లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణాలు ప్రారంభించని వారితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు.

చాగలమర్రి: స్థానిక జగనన్న లే అవుట్ కాలనీలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాస్ సూచించారు. శనివారం పట్టణంలోని కూలురు రస్తా, కస్తూర్బా పాఠశాల సమీపంలోనున్న జగనన్న లే అవుట్లను పరిశీలించారు. 2,072 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 352 పూర్తయ్యాయని, మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని ఏఈ షఫీవుల్లా చెప్పారు. హౌసింగ్ ఈఈ మాధవరావు, డీఈ నాగరాజు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, రీ సర్వే డీటీ శ్రీనివాసరెడి ఉన్నారు.

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె, మాచినేనిపల్లె గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, పంచాయతీ కార్యదర్శులు జయరాముడు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు.